క్లుప్తంగా

సంపత్‌రావుకు పురస్కారం ప్రదానం



అవార్డు అందుకుంటున్న తాడిపర్తి సంపత్‌రావు

పెనుమంట్ర: మండలంలోని పొలమూరు గ్రామానికి చెందిన రిటైర్డ్ టీచర్, స్వచ్ఛంద సేవకుడు తాడిపర్తి సంపత్‌రావు ఆదివారం హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అరిగపూడి ఫౌండేషన్ విశిష్ట సేవా జాతీయ పురస్కారం అందుకున్నారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా సంపత్‌రావును నెల్లూరు జాయింట్ కలెక్టర్ కొల్లాబత్తుల కార్తీక్, కమర్షియల్ టాక్స్ జాయింట్ కమిషనర్ మేడపాటి సత్యప్రకాష్, సచివాలయ గణాంకశాఖ సంయుక్త సెక్రటరీ దిద్దేశ్రీనివాసరావు, సర్పంచ్ కాకర రాజేశ్వర రావు, ఎంపీటీసీ నాగదుర్గ, నరసింహమూర్తి, కేతా రామకృష్ణ, కొల్లాబత్తుల శ్రీనివాసరావు, కాకర రాజేంద్ర, దళిత సంఘ నాయకులు అభినందించారు.

కేపీపాలెం బీచ్‌లో సందర్శకుల సందడి



కేపీపాలెం బీచ్‌లో స్నానం చేస్తున్న భక్తులు

మొగల్తూరు: కార్తీకమాసం తొలి సోమవారం కేపీపాలెం బీచ్ సందర్శకులతో కళకళలాడింది. తీరప్రాంతాల భక్తులు ఉదయం సముద్ర స్నానం చేసేందుకు తరలి వచ్చారు. తీరంలోని ఆంజనేయ స్వామి, మత్స్యనారాయణ స్వామి, 54 అడుగుల అభయాంజనేయ స్వామి, పాండురంగ స్వామి, షిర్డీ సాయి బాబా, వెంకటేశ్వర స్వామి ఆలయాల్లో స్వామి వార్లను దర్శించుకున్నారు.

ఆలయాల్లో కార్తీక శోభ

నరసాపురం రూరల్: కార్తీక మాసం తొలి సోమవారం నరసాపురం మండలంలోని శివాలయాలు భక్తులతో పోటెత్తాయి. లక్ష్మణేశ్వరం రేవులోని వశిష్ఠ గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించారు. మహిళలు దీపాలు వెలిగించి గోదావరిలో వదిలారు. దుర్గాలక్ష్మణేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు చేశారు. పూజల్లో మాజీ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు పాల్గొన్నారు. ఏర్పాట్లను ఆలయ కమిటీ సభ్యులు, ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ చాగంటి సురేష్‌నాయుడు పర్యవేక్షించారు.

మొక్కలు నాటిన జేసీఐ సభ్యులు



జేసీఐ ఆధ్వర్యంలో మొక్కలతో విద్యార్థులు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక లజపతిరాయ్‌పేట మాంటిస్సోరి స్కూల్ ఆవరణలో పాలకొల్లు జేసీఐ ఆధ్వర్యంలో 120 మొక్కలు నాటారు. సోమవారం పాఠశాల డైరెక్టర్ కేవీ కృష్ణవర్మ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలన్నారు. వాటి పరిరక్షించాలని సూచించారు. జేసీఐ ఆధ్వర్యంలో విద్యార్థులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో జేసీఐ కోఆర్డినేటర్ కౌషిక్, ప్రిన్సిపాల్ ఎస్‌పీఎస్ ప్రకాశరావు, ఇన్‌చార్జి బి.శ్రీదేవి పాల్గొన్నారు.

ఇళ్లు కూల్చడం దారుణం

భీమవరం: ఆకివీడు–అయిభీమవరం రోడ్డులో దశాబ్దాలుగా నివాసముంటున్న పేదల ఇళ్లను అక్రమంగా కూల్చి వేయడం దారుణమని సీపీఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం పేర్కొన్నారు. పేదల ప్రభుత్వమని గొప్పగా చెప్పుకుంటుంటే టీడీపీ ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణరాజు పేదల నివాసాలపైనే యుద్ధం చేయడం దారుణమన్నారు. ఖాళీ చేయడానికి కొంత సమయం ఇవ్వాలని పేదలు, బాధితులు ప్రాధేయ పడి వేడుకుంటున్నా కనికరించకపోవడం అన్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే ఆదేశాలతోనే అధికారులు, పోలీసులు దౌర్జన్యంగా వ్యవహరించడం, పేదలకు అండగా ఉన్న సీపీఎం నాయకులను అరెస్టులు, గృహ నిర్బంధాలు, బెదిరింపులు, హెచ్చరికలు దారుణమన్నారు. కూల్చిన ఇళ్లకు నష్ట పరిహారంతోపాటు స్థలాలు ఇచ్చి, ఇళ్ల నిర్మాణం చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

చెస్ విజేతలకు బహుమతులు

భీమవరం: జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్–13 ఓపెన్ అండ్ గరల్స్ చెస్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో విజేతలకు చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మాదాసు కిషోర్ సోమవారం బహుమతులను అందజేశారు. బాయ్స్ విభాగంలో అనేపు శశాంక్ (తాడేపల్లిగూడెం) ప్రథమ, నీలి కుశ్వంత్ (భీమవరం) ద్వితీయ, గరల్స్ విభాగంలో పెన్మెత్స సహస్ర (భీమవరం) ప్రథమ, సాధనాల అంజలిప్రియ (భీమవరం) ద్వితీయ స్థానాల్లో నిలిచారు. అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

రొయ్యల చెరువుల వద్ద మృత్యుఘంటికలు

- గట్లపైనే విద్యుత్ వైర్లు
- రక్షణ పరికరాలు కరువు
- ప్రాణాలు కోల్పోతున్న కష్టజీవులు



వడ్లవానిపాలెంలో రొయ్యల చెరువు గట్టు వెంబడి వేసిన విద్యుత్ వైరు

పాలకొల్లు అర్బన్: డెల్టా ప్రాంతంలో ఆక్వా సాగు లాభసాటి వాణిజ్య పంట. దీంతో పచ్చని వరి పొలాలను రాత్రికి రాత్రి రొయ్యల చెరువులుగా మార్చేస్తున్నారు. ఆక్వా సాగుకు రైతులు రూ.లక్షల్లో పెట్టుబడుతున్నారు. లాభాలతోపాటు నష్టాలనూ చవిచూస్తున్నారు. రొయ్యల సాగు అంటే రూ.లక్షల్లో పెట్టుబడి. రొయ్యల సాగుకు డెల్టాలో కొన్ని ప్రాంతాల్లో అనుమతులు లేకపోయినా రైతులు సంబంధిత శాఖల అధికారులను రాజకీయ సిఫార్సులతోనో, లేదా కాసుల కురిపించో అక్రమార్గంలో సాగుకు సిద్ధమవుతున్నారు. గట్లపైనే విద్యుత్ వైర్లు ఏర్పాటుచేస్తున్నారు. తగిన రక్షణ చర్యలు చేపట్టకపోవడంతో రొయ్యల చెరువుల వద్ద పనిచేసే కష్ట జీవులు విద్యుత్ షాక్ గురై విగత జీవులవుతున్నారు. రొయ్యలకు అవసరమైన ఆక్సిజన్ ఉత్పత్తి చేయడానికి నిరంతరం చెరువుల్లో ఏరియేటర్లను నడుపుతారు. గట్లపై వేసిన విద్యుత్ వైర్లను ఎలుకలు కొరికేయడంతో అప్పటికప్పుడు ఏరియేటర్లు తిరగడం ఆగిపోతుంటాయి. వాటి మరమ్మతులకు ప్రైవేటు ఎలక్ట్రీషియన్లను ఆశ్రయిస్తారు. అదే వారిపాలిట మృత్యుఘంటికలుగా మారుతున్నాయి. రైతుల ఒత్తిడి మేరకు ఎలక్ట్రీషియన్లు కనీస జాగ్రత్తలు పాటించకుండా విద్యుత్ వైర్లను తాకడంతో మృత్యువాత పడుతున్నారు. చెరువుల వద్ద ఉపాధి కోసం కూలిపని చేస్తున్న కూలీలు సైతం ప్రమాదం అంచున పనిచేస్తున్నారు. పాలకొల్లు మండలం వెలివెల గ్రామంలో గత రెండేళ్ల కాలంలో ఇద్దరు ఎలక్ట్రీషియన్లు మృత్యువాత పడ్డారు.

రక్షణ కరువు

లక్షలు పెట్టుబడులు పెట్టి ఆక్వా సాగు చేస్తున్న రైతులు చెరువుల వద్ద రక్షణ చర్యలు చేపట్టడం లేదు. విద్యుత్ ప్రమాదం నుంచి తప్పించుకోవడానికి చేతులకు గ్లౌజులు, కాళ్లకు బూట్లు ఏర్పాటు చేయాలి. అయితే చిన్న, పెద్ద కమతాల రైతులు సైతం వీటిని ఏర్పాటు చేయడం లేదు. విద్యుత్ శాఖ అధికారులు కూడా తగిన శ్రద్ధ వహించడం లేదు. దీంతో ఎలక్ట్రీషియన్లు, కూలీల జీవితం అర్థాంతరంగా ముగిసిపోతోంది.

పాలకొల్లు నియోజకవర్గంలో ఉన్న చెరువులు, రైతుల వివరాలు

మండలం	చెరువులు	రైతులు	రక్షణ పరికరాలు
పాలకొల్లు	3,100	900	లేవు
పోడూరు	2030	500	లేవు
యలమంచిలి	2500	620	లేవు

రక్షణ పరికరాలు ఏర్పాటు చేస్తా



నేను 20 ఏళ్ల నుంచి ఆక్వా సాగు చేస్తున్నాను. 10 ఎకరాలకు పైగా రొయ్యల సాగు చేస్తున్నాను. అయితే చెరువుల వద్ద రక్షణ పరికరాలు ఏర్పాటు చేయాలన్న ఆలోచన లేదు. తక్షణమే వాటిని చెరువుల వద్ద ఏర్పాటు చేస్తా. కూలీలకు రక్షణగా ఉంటుంది.

– శీలం సూరిబాబు, ఆక్వా రైతు, పాలకొల్లు

ఇరిగేషన్ ఏఈ శ్రీనివాస్‌కు నోటీసు

పాలకొల్లు అర్బన్: నీటిపారుదల శాఖ సిద్ధాంతం సెక్షన్‌లో ఏఈ శ్రీనివాసరావుకి ఆ శాఖ ఉన్నతాధికారి సంజాయిషీ నోటీసు ఇచ్చారు. జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు రెండు రోజుల క్రితం పోడూరు మండలం వద్దిపర్రు గ్రామ పర్యటనలో ఆ గ్రామానికి చెందిన రైతులు ఇరిగేషన్ ఏఈ శ్రీనివాసరావుపై పలు ఫిర్యాదులు చేశారు. వరి చేలను నీరందక ఇబ్బందులు పడుతున్నామని, ఏఈకి ఫోన్ చేస్తే స్పందించడం లేదని మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో మంత్రి ఆగ్రహం వ్యక్తం చేసి శ్రీనివాసరావుపై చర్యలు తీసుకోవాలని ఆ శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.

ఎయిడెడ్ టీచరు పోస్టులకు దరఖాస్తుల గడువు పెంపు

పెనుగొండ: స్థానిక ఎస్వీకేపీ అండ్ ఎస్కేవీఆర్ బాలికోన్నత పాఠశాలలోని ఎయిడెడ్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల గడువు పెంచినట్టు పాలకవర్గ సెక్రటరీ కరస్పాండెంట్ కె.రామచంద్రరాజు ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబరు 1 నుంచి 21 వరకు దరఖాస్తులు స్వీకరించామని, ఈ గడువును ఈ నెల 11 వరకు పొడిగించినట్టు పేర్కొన్నారు. అర్హత గల మహిళా అభ్యర్థులు ఓపెన్ కాంపిటీషన్ స్కూల్ అసిస్టెంట్ (గణితం, బయోలజీ, హ్యూమనిటీస్) గ్రేడ్ వన్ తెలుగు, పీఈటీ టీచరు, సెకండరీ గ్రేడ్ టీచర్ (ఓసీ-01, ఎస్సీ-01) పోస్టులకు ధ్రువీకరణ పత్రాలు జిరాక్స్‌లతో పాఠశాలకు వ్యక్తిగతంగా లేదా పోస్టులో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

హౌసింగ్ బోర్డు కాలనీలో అగ్నిప్రమాదం

పాలకొల్లు సెంట్రల్: స్థానిక 26వ వార్డు హౌసింగ్ బోర్డు కాలనీలో దిగమర్తి నారాయణస్వామికి చెందిన రేకుల షెడ్డు అగ్నిప్రమాదం సంభవించింది. ఆ షెడ్డులో అద్దెకు ఉంటున్న పి.మేరి సోమవారం ఇంటికి తాళం వేసుకుని బయటకెళ్లింది. ఆ సమయంలో ఇంటిలో నుంచి పొగ రావడంతో స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక అధికారులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేశారు. ఈ ఘటనలో సుమారు రూ.2 లక్షల ఆస్తి నష్టం సంభవించినట్టు ఫైర్ ఆఫీసర్ జానకిరామ్ తెలిపారు.

ప్రమాద ఘటనపై కేసు

నరసాపురం: మొగల్తూరురోడ్డులో గతనెల 31న జరిగిన ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై ముత్యాలరావు సోమవారం తెలిపారు. పట్టణానికి చెందిన రొయ్యల వ్యాపారి వాటాల శివసుందర్ స్నేహితుడితో కలిసి మొగల్తూరు వైపు మోటార్ సైకిల్‌పై వెళుతుండగా గుర్తుతెలియని వ్యక్తి కారుతో ఎదురుగా ఢీకొట్టి వెళ్లిపోయాడు. గాయాల పాలైన శివసుందర్ ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స తీసుకున్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై చెప్పారు.

పట్టభద్రుల ఓటు నమోదుకు రేపటి వరకే గడువు

పాలకొల్లు సెంట్రల్: ఈ నెల 6వ తేదీలోపు పట్టభద్రుల ఓటు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ యడ్ల దుర్గాకిషోర్ అన్నారు. అర్హులంతా ఫారం 18తో ఆన్‌లైన్ ద్వారా లేదా తహసీల్దార్ లేదా మండల పరిషత్ లేదా ఎంఈఓ పట్టణ మునిసిపల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సోమవారం పేర్కొన్నారు. పాస్‌పోర్టు సైజు ఫొటో, గెజిటెడ్ అధికారితో అటస్టేషన్ చేసిన గ్రాడ్యుయేషన్ లేదా డిగ్రీ పత్రాల జిరాక్స్, నియోజకవర్గం ఓటరు గుర్తింపు కార్డు, నివాస పత్రం జిరాక్స్ కాపీలతో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

ఎమ్మెల్సీ ఓటు నమోదు నమోదు చేసుకోండి

మొగల్తూరు: గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటు నమోదుకు ఈనెల 6వ తేదీతో గడువు ముగుస్తుందని తహసీల్దార్ కె.రాజకిశోర్ తెలిపారు. 2021 అక్టోబర్ నాటికి డిగ్రీ పూర్తయిన వారు డిగ్రీ ప్రొవిజనల్, ఆధార కార్డు, ఓటరు కార్డు, జిరాక్స్‌లతో పాటు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలపై గెజిటడ్ అధికారితో అటెస్టేషన్ చేయించి స్థానిక రెవెన్యూ కార్యాలయం లేదా మండల పరిషత్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సోమవారం పేర్కొన్నారు.

మార్మోగిన శివనామస్మరణ

భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు



పెనుగొండ : వాసవీ శాంతి థాంలో నగరేశ్వరుడు



యలమంచిలి : మేడపాడు ఉమారామలింగేశ్వరస్వామి



పాలకొల్లు అర్బన్ : శివదేవునిచిక్కాలలో శివదేవస్వామి



పాలకొల్లు సెంట్రల్ : విద్యుద్దీపాలం కరణలో ఆలయ గాలిగోపురం



పెనుగొండ : సిద్ధాంతం కేదారీఘాట్‌లో కార్తీక దీపాలు వదులుతున్న మహిళలు



నరసాపురం : గుడిలో భక్తులతో ఉన్న ఆబోతు



మొగల్తూరు : పార్వతీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో..



పాలకొల్లు సెంట్రల్ : నక్షత్రవనం వద్ద కార్తీక దీపాలు వెలిగిస్తున్న అయ్యప్పస్వాములు

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయం కార్తీకమాసం తొలి సోమవారం వేకువజాము నుంచి భక్తుల శివనామ స్మరణతో పులకించింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనడంతో క్యూలైన్లు నిండిపోయాయి. అభిషేకాలు చేయించుకునే భక్తులతో ఆలయం వెనుక భాగం, అభిషేకాల మండపం నిండిపోయాయి. ఆలయం నుండి బయటకు వెళ్లే మార్గాన్ని ఉత్తరం వైపుకు ఏర్పాటు చేశారు. సుమారు 30 వేల మంది యాత్రికులు, భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్టు చెబుతున్నారు. రేపాక వారి సత్రంలో దేవస్థానం ఆధ్వర్యంలో దాతల సహకారంతో భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ ప్రాకార మండపం లోపల కార్తీక దీపాలు వెలిగించేందుకు భక్తులు కూర్చుని ఉండడంతో స్వామివారిని దర్శించుకోవడానికి ప్రదక్షిణ చేసే భక్తులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ముచ్చర్ల శ్రీనివాసరావు, పట్టణ సిఐ కె. రజనీకుమార్, ఎస్సైలు, పోలీసు, సచివాలయ ఉమెన్ ప్రొటెక్షన్ పోలీసులు, ఆలయ సిబ్బంది తమ సేవలను అందించారు. భక్తులకు అవసరమైన సౌకర్యాలపై ఆర్డీఓ దాసి రాజు పర్యవేక్షించారు. స్వామివారిని 40 వేల మంది వరకు దర్శించుకున్నారని, సుమారు 10 వేల మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారని తెలిపారు. కాలువ రేవుల వద్ద శుభ్రం చేసి, మహిళలు దుస్తులు మార్చుకోవడానికి షెల్టర్, 12 ప్రాంతాల్లో మొబైల్ టాయిలెట్స్ ఏర్పాటు చేశామని చెప్పారు. యాత్రికుల కార్లు, ద్విచక్ర వాహనాల పార్కింగ్ మార్కెటింగ్ యార్డు, ఎన్‌టీఆర్ కళాక్షేత్రంలో ఏర్పాటుచేశామన్నారు. మూడు షిఫ్టులుగా మెడికల్ క్యాంపులు నిర్వహించామని తెలిపారు. తహసీల్దార్ యడ్ల దుర్గా కిషోర్, మునిసిపల్ కమిషనర్ బి.విజయసారథి, ఆలయ ఈఓ ముచ్చర్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వాయుత్రిలింగ క్షేత్రాల్లో పూజలు

పాలకొల్లు అర్బన్: వాయు త్రిలింగ క్షేత్రంగా ప్రసిద్ధి చెందిన శివదేవునిచిక్కాలలోని పార్వతీ సమేత శివదేవస్వామిని భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. అభిషేకాలు, పూజలు చేశారు. దిగమర్రులో వేణుగోపాలస్వామి, నరేంద్రస్వామి వార్లకు పూజలు చేశారు. మహిళలు ఆలయంలో కార్తీమ దీపాలు వెలిగించారు.

అభిషేకం భక్తులతో ఆబోతు

నరసాపురం: స్థానిక 12వ వార్డు ఏకాంభరేశ్వర స్వామి ఆలయంలో స్వామివారికి అభిషేకం ప్రారంభించగా, అదే సమయంలో ఓ ఆబోతు ఆలయం వద్దకు చేరుకుని భక్తుల పక్కన నిలుచుంది. వెంకన్న స్వరూపంగా ఆబోతుకు కూడా భక్తులు మొక్కుకున్నారు. 39 నిమిషాల పాటు ఆబోతు అక్కడే ఉండటం, భక్తులతోపాటు గిడి బయటకు రావడంతో ఆశ్చర్యం వ్యక్తం చేశారు. వశిష్టగోదావరి వలంధర్‌రేవులో మహిళలు పెద్ద సంఖ్యలో స్నానాలు చేసి గోదావరిలో దీపాలు వదిలారు. పరమశివుడి విగ్రహానికి పూజలు చేశారు. కపిలమల్లేశ్వరస్వామి, గోదావరిగట్టున ఉన్న అమరేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారు జాము నుంచే గోదావరి ఘాట్‌ల వద్ద, శివాలయాల వద్ద భక్తుల రద్దీ నెలకొంది.

మార్మోగిన శివనామస్మరణ

మొగల్తూరు: మొగల్తూరు మండలం ముత్యాలపల్లి భువనేశ్వరీ సమేత ముక్తేశ్వర స్వామి, పేరుపాలెం చంద్రమౌళీశ్వర స్వామి, కాళీపట్నం కాశీకేశ్వర స్వామి, మొగల్తూరు పురాతన పార్వతీ విశ్వేశ్వర స్వామి, వనమల్లికార్జున స్వామి ఆలయాల్లో అభిషేకాలు నిర్వహించారు. మొగల్తూరు శివాలయంలో అర్చకుడు కొత్తలంక బాపన్న నేతృత్వంలో శివలింగానికి పంచామృతాలతో అభిషేకం చేశారు. ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

మేడపాడులో లక్ష బిల్వార్చన

యలమంచిలి: మేడపాడు గ్రామంలోని ఉమారామలింగేశ్వస్వామి ఆలయంలో లక్ష బిల్వార్చన చేశారు. సుమారు 100కి పైగా జంటలు పూజలో పాల్గొన్నాయి. లోక కళ్యాణార్థం గ్రామస్తుల సహకారంతో ఈ పూజ నిర్వహించారు.

కార్తీక సోమవారం

పెనుగొండ: సిద్ధాంతంలోని కేదారీఘాట్ భక్తులతో కిక్కిరిసిపోయింది. వశిష్ఠాగోదావరిలో మహిళలు స్నానాలు చేశారు. కేదారీఘాట్‌లోని శివలింగానికి జాలాభిషేకం చేశారు. కేదారేశ్వర స్వామి ఆలయంలో తులసికి పూజలు చేసి కేదారేశ్వరుడుని దర్శించుకొన్నారు. పెనుగొండ నగరేశ్వర మహిషాసురమర్దనీ వాసవీ కన్యకపరమేశ్వరి ఆలయంలో నగరేశ్వరునికి ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. వాసవీ శాంతి థాంలోని జ్యోతిర్లింగ క్షేత్రాల నుంచి తరలించి ఏర్పాటు చేసిన లింగాలకు, నగరేశ్వరునికి క్షీర, జలాభిషేకాలు చేశారు. ఆచంటలోని ఆచంటేశ్వరునికి రుద్రాభిషేకం, అర్చనలు నిర్వహించారు.

డ్రైయినేజీ నిర్మాణం కోరుతూ ఆందోళన



మొగల్తూరు పంచాయతీ వద్ద ఆందోళన చేస్తున్న ఆదర్శన నగర్ వాసులు

మొగల్తూరు: మురుగు పారేందుకు డ్రెయినేజీ నిర్మించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక ఆదర్శనగర్ కాలనీ వాసులు పంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సీపీఎం నేత యడ్ల చిట్టిబాబు మాట్లాడుతూ మేజర్ పంచాయతీ ఐన మొగల్తూరులో డ్రెయినేజీ సౌకర్యం లేకపోవడంతో గ్రామస్తులు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గ్రామ శివారులోని ఆదర్శనగర కాలనీలో వర్షపు నీటితో పాటు వాడకం నీరు బయటకెళ్లే మార్గంలేక ఎక్కడికక్కడ నీరు నిలిచిపోతుందని చెప్పారు. దోమలు పెరిగిపోయి కాలనీ వాసులు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని గ్రామ కార్యదర్శి మచ్చర్ల నాగేశ్వరరావుకు అందజేశారు. కార్యక్రమంలో వాటాల కృష్ణ, కొపనాతి సాయి, మల్లిపూడి బుల్లియ్య, చొప్పల వరలక్ష్మి, పితాని రాజారత్నం తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులపై వారసులు దౌర్జన్యం చేస్తే చర్యలు



కుమారుడు నుంచి రక్షణ కల్పించాలని ఆర్డీఓను కోరుతున్న విశ్వనాథం

నరసాపురం: వయోభారంలో ఉన్న తల్లిదండ్రులపై వారసులు దౌర్జన్యం చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఆర్డీఓ దాసి రాజు హెచ్చరించారు. ఇలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్న తల్లిదండ్రులు డివిజన్ స్థాయిలో సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ బోర్డుకు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని సూచించారు. సోమవారం ఆర్డీఓ తన చాంబర్‌లో ప్రజా ఫిర్యాదుల వేదిక నిర్వహించారు. కార్యక్రమంలో మొత్తం 32 ఫిర్యాదులు అందినట్టు ఆర్డీఓ తెలిపారు. పాలకొల్లు మండలం వెలివెల గ్రామం చనిపేటకు చెందిన గుమ్మాపు విశ్వనాథం తన చిన్న కుమారుడు తనను చంపేస్తానని బెదిరిస్తున్నాడని, కొడుతున్నాడని ఫిర్యాదు చేశారు. తగిన న్యాయం చేస్తానని వృద్ధునికి ఆర్డీఓ హామీ ఇచ్చారు. వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

కోడి పందాల దిబ్బలో రోడ్లు నిర్మించాలి

పెనుగొండ : స్థానిక కోడిపందాల దిబ్బకాలనీలో రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలని సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా చేశారు. తహసీల్దార్ జి.అనితకుమారి, ఎంపీడీఓ టి.సూర్యనారాయణ మూర్తికి వినతిపత్రం అందజేశారు. మహిళా సంఘ నాయకురాలు గుడాల వాణి మాట్లాడుతూ వీధిలైట్లు ఏర్పాటు చేసినా, ఇంత వరకు విద్యుత్ సౌకర్యం కల్పించలేదని తెలిపారు. రోడ్లు నీటమునిగి రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో వీరవల్లి లక్ష్మి, చింతపల్లి పద్మ, శకుంతల, జ్యోతి సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

యాత్రికులు ముక్కు మూసుకోవాల్సిందే!



ముక్కు మూసుకుని చేపల మార్కెట్ మార్గం నుంచి ఆలయానికి వెళుతున్న యాత్రికులు

పాలకొల్లు సెంట్రల్: కార్తీకమాసంలో పంచారామక్షేత్రాలను దర్శించుకోవడానికి ఎంతో పవిత్రతో వస్తాం. పాలకొల్లు క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయానికి చేపల మార్కెట్ మార్గంలో వెళ్లాల్సి రావడంతో యాత్రికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. యాత్రికుల ఇబ్బందుల కారణంగా స్థానికులు యాత్రికుల బస్సులను అల్లు రామలింగయ్య విగ్రహం వద్ద ఆపి అక్కడ భక్తులను దింపి ఆలయానికి తరలించాలని కోరుతున్నారు. బస్‌లను మార్కెట్ యార్డు వద్ద పార్కింగ్ చేయించాలి. యాత్రికులు దర్శనం చేసుకుని వచ్చిన తరువాత మార్కెట్ యార్డు వద్ద బస్‌లు పార్కింగ్ ఉందని మార్గం చూపించే విధంగా ఎన్టీఆర్ కళాక్షేత్రం వద్ద మైక్ ప్రచారం చేయాలి. భక్తుల సౌకర్యార్థం మొబైల్ టాయిలెట్స్ ఏర్పాటు చేశారు. మహిళల టాయిలెట్స్ వద్ద శానిటరీ వర్కర్ పురుషుడిని నియమించారు. అతను డబ్బులు అడుగుతుండడంతో మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ మహిళా శానిటరి కార్మికురాలిని నియమించాలని వారు కోరుతున్నారు. సమస్యను ఆర్డీఓ దాశి రాజు దృష్టికి తీసుకెళ్లగా మార్కెట్‌లో దుర్వాశన రాకుండా బరకాలు కట్టిస్తామని, శానిటేషన్ మరింత ఎక్కువగా చేయిస్తామని, టాయిలెట్స్ వద్ద మహిళను నియమిస్తామని తెలిపారు.

ఉపాధి వేతన బకాయిలు చెల్లించండి



తహసీల్దారుకు వినతి పత్రం అందిస్తున్న దృశ్యం

పెనుగొండ: ఉపాధి హామీ కూలీలకు వేతనాలు సక్రమంగా చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘ కార్యదర్శి షేక్ పాదుషా డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా చేశారు. తహసీల్దారు జి.అనితా కుమారికి వినతిపత్రం అందజేశారు. వడలిలో ఫీల్డ్ అసిస్టెంట్ సునీత ఉపాధి కూలీలకు వేతనాలు తగ్గించి చెల్లిస్తున్నారని, పనిచేయని వారికి మస్తరు వేసి బ్యాంక్ ఖాతాల్లోకి డబ్బులు అక్రమంగా తరలిస్తున్నారని ఆరోపించారు. వీటిపై విచారణ చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు నాగిశెట్టి గంగారావు, ఆదినారాయణ, కార్మికులు కామన వరలక్ష్మి, కొండడేటి సుబ్బలక్ష్మి, కామన మహేష్, కోమటి గంగ, సుబ్బారావులు పాల్గొన్నారు.